AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in
4-12-2025
NIZAMABAD / KAMAREDDY
PAGES - 2


## ఎనిమిదేళ్లుగా మ్యూజియం బంద్



2



2

## సర్పంచ్ ఇంటి వద్ద టెంట్ దగ్ధం

## అవినీతి నిరోధక శాఖ వారోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ



**అక్షరటుడే, ఇందూరు:** జిల్లాలో అవినీతి నిరోధక శాఖ వారోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్లను జిల్లా సమీకృత కార్యాలయాల భవనంలో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, సీపీ సాయిచైతన్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఈవో అశోక్, డీవైఎస్‌వో పవన్, అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ శేఖర్ గౌడ్, ఇన్‌స్పెక్టర్ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మాయికి అబార్షన్ ఘటనపై విచారణ..

అక్షర టుడే కథనానికి స్పందన

**అక్షరటుడే, కామారెడ్డి :** ఓ యువతి అబార్షన్ ఘటనపై అధికారులు విచారణ చేపట్టారు. 'పెళ్లి కాకుండానే ప్రెగ్నెంట్.. అబార్షన్ చేసిన ప్రైవేట్ వైద్యుడు' శీర్షికతో 'అక్షరటుడే'లో బుధవారం కథనం ప్రచురితం కాగా.. అధికారులు స్పందించారు. కామారెడ్డి నుంచి వైద్యాధికారులు, తాడ్వాయి పోలీసులు బుధవారం రాత్రి తాడ్వాయి గ్రామానికి చేరుకుని సదరు అమ్మాయికి డీఎన్ఏ పరీక్షలు నిర్వహించినట్లుగా సమాచారం. ఘటనకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నట్టుగా తెలుస్తోంది. మళ్లీ గురువారం ఉదయమే వైద్యులు, కామారెడ్డి, తాడ్వాయి పోలీసులు గ్రామానికి చేరుకుని విచారణ చేపడుతున్నారు. అయితే ఆర్నెళ్ల క్రితమే అమ్మాయి గర్భం దాల్చడంతో అప్పటికి ఆ యువకుడు మైనర్ అయి ఉండవచ్చన్న అనుమానాలు అధికారులు వ్యక్తం చేసినట్లుగా విశ్వసనీయ సమాచారం. ఏ వైద్యుడి వద్ద అబార్షన్ చేయించారనే వివరాలు ఇంకా బయటకు పొక్కనీయడం లేదు. పోలీసులు, వైద్యులు గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టడంతో గ్రామంలో ఆందోళన నెలకొన్నట్టుగా తెలుస్తోంది. వైద్యాధికారులకు సమాచారం ఇవ్వకుండా బేరం కుదుర్చుకుని అబార్షన్ చేసిన వైద్యుడిని అధికారులు విచారిస్తున్నట్లుగా సమాచారం. గ్రామంలో ఏం జరుగుతోందని ఇప్పటికప్పుడు ఆయన కొందరి ద్వారా సమాచారం తెలుసుకుంటున్నట్లుగా తెలుస్తోంది. ఇరు వర్గాలను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చి వైద్యాధికారులకు చెప్పాల్సిన బాధ్యత వైద్యుడిపై ఉండగా ఆయన అబార్షన్ చేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది. జిల్లాలో వైద్యాధికారుల పర్యవేక్షణ కొరవడడంతోనే ఈ తరహా ఘటనలు జరుగుతున్నాయన్న వాదన వినిపిస్తోంది. ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకుంటే ఈ తరహా అబార్షన్లు చేసే అవకాశం ఉండదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే ఈ ఘటనలో వైద్యుడిపై చర్యలు తీసుకుంటారా..? కేసులు నమోదు చేస్తారా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు ఉన్నతాధికారులు చర్యలు చేపడుతున్నారు. తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పదేపదే చెబుతున్నారు. అయినా కొందరు అధికారులు నిర్లక్ష్యం వహిస్తూనే ఉన్నారు. ఇలాంటి వారిపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. తాజాగా నాగిరెడ్డిపేట ఎంపీడీవో, ఎంపీవోపై సస్పెన్షన్ వేటు పడటం చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల నిర్వహణపై నిర్లక్ష్యం వహించే వారికి ఈ సస్పెన్షన్లు ఒక హెచ్చరికగా భావిస్తున్నారు.**

**- అక్షరటుడే, కామారెడ్డి**




# నిర్లక్ష్యం వహిస్తే వేటే..

- పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ
- నాగిరెడ్డిపేట ఎంపీడీవో, ఎంపీవోల సస్పెన్షన్
- ఎన్నికల నిర్వహణలో నిర్లక్ష్యమే కారణం

జిల్లాలో 532 సర్పంచ్, 1,520 వార్డు స్థానాలకు మూడు విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి. మొదటి, రెండో దశ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కూడా పూర్తయింది. ప్రస్తుతం మూడో దశ నామినేషన్లను అధికారులు స్వీకరిస్తున్నారు. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, పొరపాట్లు జరగకుండా ఉండేందుకు ఉన్నతాధికారులు ఇప్పటికే చర్యలు చేపట్టారు. శిక్షణ సమయంలో ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించారు. ఎన్నికల నిర్వహణలో నిబంధనలు పాటించాలని సూచించారు.

### నిర్లక్ష్యంపై సీరియస్

ఎన్నికల నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దని కలెక్టర్ హెచ్చరిస్తున్నా కొందరు అధికారుల తీరు మారడం లేదు. తాజాగా ఎన్నికల నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన నాగిరెడ్డిపేట ఎంపీడీవో లలిత కుమారి, ఎంపీవో ప్రభాకర్‌చారిలను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఉత్తర్వులు జారీ చేశారు. సర్పంచ్, వార్డు సభ్యుల కోసం నామినేషన్ పత్రాలు సమర్పించిన లెక్కలను ఎంపీడీవో కార్యాలయం నుంచి జిల్లా అధికా రులకు పంపించాల్సి ఉంటుంది. అయితే ఆ నివేదికలో వ్యత్యాసం ఉంది. దీంతో బుధవారం జిల్లా అధికా రుల ఆదేశాల మేరకు ఎల్లారెడ్డి డీఎల్పీవో సురేందర్ ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్నారు. ఆ సమయంలో ఎంపీడీవో, ఎంపీవోలు ఇద్దరు కూడా కార్యాలయంలో లేరు. ఎన్నికల వేళ స్థానికంగా ఉండకపోవడంతో పాటు దాఖలైన నామినేషన్ పత్రాల లెక్కల్లో వ్యత్యాసం ఉండడంతో ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

### అధికారులకు హెచ్చరిక

సర్పంచ్, వార్డు స్థానాలకు జరుగుతున్న ఎన్నికల నేపథ్యంలో అధికారులు నిబంధనల ప్రకారం కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. తాజాగా ఎంపీడీవో, ఎంపీవోలపై సస్పెన్షన్ వేటు వేయడం నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మిగతా అధికారులకు సంకేతమన్న చర్చ అధికార వర్గాల్లో సాగుతోంది. అయితే మరికొన్ని మండలాలలో కూడా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న టాక్ వినిపిస్తోంది. ఈ చర్యలతో సదరు అధికారుల్లో మార్పు వస్తుందని భావిస్తున్నారు.



## కాంగ్రెస్ మద్దతుదారులను గెలిపించాలి

**అక్షరటుడే,పెద్ద కొడప్‌గల్:** కాంగ్రెస్ మద్దతుదారులను గెలిపించుకోవాలని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. మండలంలోని కాటేపల్లి కాంగ్రెస్ మద్దతుదారుడైన సర్పంచ్ అభ్యర్థి శ్రీదేవి మల్లప్ప పటేల్ గురువారం నామినేషన్ వేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ మద్దతుదారులను గెలిపించాలని ప్రజలను కోరారు. పార్టీ నాయకుల గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని పేర్కొన్నారు. మద్దతుదారులను గెలిపిస్తే గ్రామాల్లో మౌలిక సదుపాయాలతో పాటు అభివృద్ధి పనులు మరింత వేగంగా సాగుతాయని ఆయన వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ నాయకులను గెలిపించుకుందాం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారులను సర్పంచ్‌లుగా గెలిపించాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ కోరారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో సర్పంచ్ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న వారితో గురువారం ఆయన సమీక్షించారు. ఏకగ్రీవంగా గెలిచిన అభ్యర్థులకు క్యాంప్ కార్యాలయంలో శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ మద్దతుదారులను గెలిపించుకుంటే గ్రామాల్లో అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. ప్రజాప్రభుత్వం రెండేళ్లలోనే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని, పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందని ఎమ్మెల్యే వివరించారు. ప్రజలందరూ కాంగ్రెస్ మద్దతుదారులను ఆశీర్వదిస్తే భవిష్యత్‌లో మరిన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుడుతుందని వెల్లడించారు. అభ్యర్థులను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు కసరత్తు చేయాలని సూచించారు. రాజకీయ, సామాజిక సమీకరణాల్లో భాగంగా అవకాశం దక్కని ఆశావహులు ఎవరు కూడా నిరాశపడవద్దని.. భవిష్యత్తులో మంచి అవకాశాలు లభిస్తాయని చెప్పారు.



## నిజామాబాద్ రూరల్‌లో బీసీలకు 51.6 శాతం రిజర్వేషన్లు

**అక్షరటుడే నిజామాబాద్ సిటీ:** గ్రామపంచాయతీ ఎన్నికల్లో బీసీలకు 51.6 శాతం రిజర్వేషన్లు కల్పించామని ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతి రెడ్డి తెలిపారు. నగర శివారులోని క్యాంప్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో 126 నాన్ షెడ్యూల్ గ్రామపంచాయతీలు ఉన్నాయని, వాటిలోని 64 జనరల్ స్థానాల్లో 32 సీట్లు బీసీలకు కేటాయించామని తెలిపారు. బీసీల రిజర్వేషన్లను 51.6 శాతం వరకూ పెంచి సామాజిక న్యాయాన్ని అమలు చేశామని అన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో పేర్కొన్న విధంగా 42శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. బీజేపీ,బీఆర్ఎస్ కలిసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు రాకుండా అడ్డుకుంటున్నాయని విమర్శించారు. బీజేపీ ఎంపీలు పార్లమెంట్‌లో బీసీ బిల్లుపై రాజకీయ నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

## ఇందల్వాయి చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేసిన సీపీ

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా పోలీసులు సరిహద్దుల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేపడుతున్నారు. దీంట్లో భాగంగా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయిచైతన్య ఇందల్వాయి టోల్ ప్లాజాను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడారు. భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఎన్నికల సమయంలో అక్రమ రవాణా, నగదు, మద్యం అనుమానాస్పద వ్యక్తులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని సీపీ తెలిపారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట తనిఖీల టీం ఇన్‌ఛార్జి సాయికుమార్, రవీందర్ సిబ్బంది ఉన్నారు.



## ఎన్నికల విధుల్లో అప్రమత్తత అవసరం: కలెక్టర్

**అక్షరటుడే, బోధన్ :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారులు విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. ఎడపల్లి మండల పరిషత్ కార్యాలయాన్ని కలెక్టర్ గురువారం తనిఖీ చేశారు. మొదటి విడతలో ఈ మండలానికి ఈనెల 11న పోలింగ్ జరగనుండగా.. నామినేషన్ల స్వీకరణ నుంచి మొదలుకుని ఇప్పటివరకు పూర్తిచేసిన ప్రక్రియపై కలెక్టర్, ఎంపీడీవో, తహశీల్దార్‌ను అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు. ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా, ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఓటింగ్‌కు అవసరమైన ఎన్నికల సామగ్రి సిద్ధంగా ఉండాలన్నారు. బ్యాలెట్ పేపర్ల ముద్రణ, మెటీరియల్, ఎన్నికల సిబ్బంది, జోనల్ అధికారుల నియామకం తదితర ఏర్పాట్ల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న వారితో పాటు, భద్రతా బలగాలలో కొనసాగుతున్న వారు సైతం ఓటుహక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఎన్నికల సంఘం మార్గదర్శకాల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని, నిబంధనలకు అనుగుణంగా ఎన్నికల విధులను సక్రమంగా నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు. సమీక్షలో ఎంపీడీవో శంకర్, తహశీల్దార్ దత్తాద్రి తదితరులు పాల్గొన్నారు.



## సర్పంచ్ బరిలో విద్యావేత్త..

**అక్షరటుడే, బోధన్:** సాలూర మండలంలోని జాడి జమాల్‌పూర్ గ్రామంలో ఉన్నత విద్యనభ్యసించిన ఓ యువతి సర్పంచ్ బరిలో నిలిచారు. గ్రామంలో పుట్టి పెరిగిన నిహారిక బీఎస్సీ అగ్రికల్చర్ చదవారు. అనంతరం హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ కంపెనీలో పనిచేస్తున్నారు. గ్రామానికి సేవ చేయాలనే ఉద్దేశంతో ఆమె సర్పంచ్ బరిలో దిగారు. ఈ సందర్భంగా గురువారం గ్రామంలో ప్రచారం నిర్వహించారు. తనకు అవకాశం కల్పిస్తే గ్రామానికి సేవ చేస్తానని.. అభివృద్ధి చేస్తానని ఆమె పేర్కొన్నారు.





## ప్రజాస్వామ్యంలో ఎన్నికలు అత్యంత కీలకం: డీజీపీ

**అక్షరటుడే, కామారెడ్డి:** ప్రజాస్వామ్యంలో ఎన్నికలు అత్యంత కీలకమని రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గురువారం కామారెడ్డి పోలీస్ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో నిజామాబాద్ సీపీ సాయి చైతన్య, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎన్నికల సంసిద్ధతను తెలియజేశారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లకు ప్రత్యేక భద్రతా ప్రణాళికలు, బౌండోవర్ చర్యలు, చెక్‌పోస్టులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాల పనితీరు, భద్రతా ఏర్పాట్లు, మొబైల్ టీమ్స్, క్విక్ రెస్పాన్స్ టీమ్స్ తదితర అంశాలను వివరించారు. జిల్లా పరిధిలోని డీఎస్పీలతో డీజీపీ స్వయంగా మాట్లాడి వారి పరిధిలోని భద్రతా ఏర్పాట్లు, సమస్యలు, ఫోర్స్ వినియోగంపై ప్రత్యక్ష వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. ఎన్నికల సమయం ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమన్నారు. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికలను అందరూ ప్రతిష్టాత్మకంగా తీసుకుంటారన్నారు. ప్రతి ఒక్కరూ వారి ఓటుహక్కును ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకునే వాతావరణాన్ని కల్పించడం పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని చెప్పారు. జిల్లాలోని సున్నితమైన పోలింగ్ కేంద్రాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం, ద్వేషపూరిత పోస్టులు, ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసే కార్యకలాపాలను వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీ ఆదేశించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రతిఒక్కరూ ఎన్నికల నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. ఎన్నికల అనంతరం అదే రోజు విజయోత్సవ ర్యాలీలలో వివాదాలు తలెత్తే అవకాశాలు ఉన్నందున ఎవరూ ర్యాలీలు తీయరాదని తెలిపారు. సమావేశంలో నిజామాబాద్ అదనపు కమిషనర్ బస్వారెడ్డి, కామారెడ్డి అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, కామారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ చైతన్య రెడ్డి, ఉమ్మడి జిల్లాల డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు, ఆర్ఎస్సైలు పాల్గొన్నారు.

## ఓటు వేయండి.. ఉచితంగా దంత పరీక్షలు చేయించుకోండి..



**అక్షరటుడే, బాన్సువాడ :** ఓటు హక్కుపై అధికారులు అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సరైన నాయకుడిని ఎన్నుకోవాలంటే ఓటుహక్కు వినియోగించుకోవాలని వారు కోరుతున్నారు. అలాగే పలు స్వచ్ఛంద సంస్థలు సైతం ప్రజలకు ఓటుపై అవగాహన కల్పిస్తున్నాయి. ప్రజలు స్వచ్ఛందంగా ఓటు వేసేందుకు ఓ వైద్యుడు వినూత్న ప్రయత్నం చేస్తున్నాడు. మన ఓటు, మన హక్కు అనే నినాదంతో ఓటు హక్కుపై చైతన్యం కల్పిస్తున్నారు. దీంట్లో భాగంగా బాన్సువాడ పట్టణానికి చెందిన రుక్మిణి మల్టీ స్పెషాలిటీ దంత వైద్యశాల, ఇంప్లాంట్ సెంటర్ ప్రత్యేక ప్రచారాన్ని ప్రారంభించింది. ఈ సందర్భంగా దంత వైద్యశాల వైద్యులు జీవన్ మాట్లాడుతూ.. ఓటు వేయడం కేవలం హక్కు మాత్రమే కాదు.. ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. ఓటువేసిన ప్రజలకు తమ ఆస్పత్రిలో ఉచితంగా దంత పరీక్షలు చేస్తామని ఆయన పేర్కొన్నారు.



## ఆలూర్ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ ఆలూర్ మండలాధ్యక్షుడు ముక్కెర విజయ్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్ కుమార్ రెడ్డి ఈ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. సర్పంచ్ అభ్యర్థి ముక్కెర విజయ్ ఆధ్వర్యంలో గ్రామంలోని ఖండెల మల్లన్న స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పార్టీ నాయకులు, గ్రామస్థులతో కలిసి భారీ ర్యాలీగా వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు.

## పోతంగల్ సరిహద్దులో తనిఖీలు



**అక్షరటుడే, కోటగిరి:** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. దీంట్లో భాగంగా పోతంగల్ మండలంలోని తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన మంజీర వద్ద గురువారం ప్రత్యేక బృందం వాహనాల తనిఖీలు చేపట్టింది. అధికారులు తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, నుంచి వచ్చిపోయే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. మద్యం, నగదు, రవాణా కాకుండా చర్యలు చేపడుతున్నారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## ఎనిమిదేళ్లుగా

# మ్యూజియం బంద్..

▸ తిలక్‌గార్డెన్‌లో నిరుపయోగంగా పురావస్తు ప్రదర్శన శాల
▸ ఆలనాపాలనా కరువు ▸ మరమ్మతులు చేసినా.. సిబ్బంది లేక ఇబ్బంది

**ఇప్పటి యువతకు చరిత్ర తెలియాలంటే ఆనాటి ఆనవాళ్లు, శిలలు, పనిముట్లే ఆధారం. అటువంటి వస్తువులను పదిలంగా భద్రపర్చి ప్రజలకు చూపించాల్సిన బాధ్యత పురావస్తు శాఖది. అయితే జిల్లాకేంద్రంలోని ఉన్న ఏకైక పురావస్తు ప్రదర్శన శాల మూలకుపడింది. ఏళ్లు గడుస్తున్నా..తెరుచుకోవడం లేదు.**
**– అక్షరటుడే, ఇందూరు**

జిల్లాకేంద్రంలోని తిలక్ గార్డెన్‌లో సుమారు 15ఏళ్ల క్రితం పురావస్తు శాఖ ఆధ్వర్యంలో ప్రదర్శనశాలను ఏర్పాటు చేశారు. శాతవాహనులు, కాకతీయుల కాలం నాటి అనేక ఆనవాళ్లు, దేవుని శిలలు, శిలా తోరణాలు, పనిముట్లు, కత్తులు ఇలా సుమారు 460 రకాల ఆనాటి చరిత్రను తెలిపే పురాతన వస్తువులు అందుబాటులో ఉంచారు. మొదట్లో సాఫీగా సాగినా.. తర్వాత కాలంలో ఆలనాపాలన లేక మరుగున పడింది.

### మరమ్మతులు చేసినా...

జిల్లా కలెక్టర్‌గా యోగితారాణా ఉన్న సమయంలో మ్యూజియం భవనం మరమ్మతుల కోసం సుమారు రూ.45 లక్షల నిధులు మంజూరయ్యాయి. వాటితో మరమ్మతులు పూర్తి చేశారు. కానీ మ్యూజియం లోపల వస్తువులను భద్రపర్చే షోకేజ్ పెట్టెలతో పాటు కొన్ని పురాతన వస్తువుల మరమ్మతులకు మరికొన్ని నిధులు అవసరం ఉన్నాయి. కానీ ఇప్పటివరకు విడుదల కాకపోవడంతో మూతపడినట్లు తెలుస్తోంది.

### సిబ్బంది కొరత..

పురవస్తు శాఖలో గత కొన్నేళ్లుగా రిక్రూట్‌మెంట్ లేకపోవడంతో సిబ్బంది కొరత తీవ్రంగా ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో జిల్లాలో ఉన్న అధికారి పదవి విరమణ పొందడంతో నూతన అధికారిని నియమించలేదు. ప్రస్తుతం ప్రభుత్వ ఆదేశాలతో ఆయననే ఇన్చార్జిగా వ్యవహరిస్తున్నారు. సిబ్బంది, నిధుల కొరత తదితర కారణాలతో మ్యూజియం మూతపడింది.

### సిబ్బంది లేదు.. మరమ్మతులు అవసరం

గతంలో మ్యూజియం భవనానికి మరమ్మతులు చేపట్టారు. భవనం లోపల మరికొన్ని మరమ్మతుల అవసరం ఉన్నాయి. అలాగే సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. నేనొక్కడినే పర్యవేక్షిస్తున్నాను. గతంలోనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాను.

**- తోట రాజేందర్, మ్యూజియం ఇన్‌ఛార్జి**

## సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

**అక్షరటుడే, బాన్సువాడ:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిందూ దేవుళ్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలను బీజేపీ నాయకులు ఖండించారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బీజేపీ కార్యకర్తలు సీఎం దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు కోణాల గంగారెడ్డి మాట్లాడుతూ.. హిందువు దేవుళ్లను అవహేళన చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడడం ఏ మాత్రం సమంజసం కాదన్నారు. ఎన్నికల ముందు హిందుత్వం పేరిట వ్యాఖ్యలు చేసిన రేవంత్ రెడ్డి, అధికారంలోకి వచ్చిన తర్వాత హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ప్రవర్తిస్తున్నాడని విమర్శించారు. సీఎం చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని, హిందువులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు



చిదుర సాయిలు, మాజీ అసెంబ్లీ కన్వీనర్ గుడుగుట్ల శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శి చిరంజీవి, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి చీకట్ల రాజు, ప్రసాద్, బాలరాజ్, అనిల్, భాస్కర్ రెడ్డి, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

బడా భీమ్‌గల్‌లో నామినేషన్ వేస్తున్న రాగుల లత మోహన్




ఆర్మూర్ మండలం మిర్దాపల్లిలో సాయరెడ్డి..




## కొనసాగుతున్న నామినేషన్లు

**మూడో విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. ఉమ్మడి జిల్లాలో అభ్యర్థులు గురువారం నామినేష్లను దాఖలు చేశారు. నామినేషన్ల సందర్భంగా గ్రామస్థులు, మద్దతుదారులు ర్యాలీలు తీశారు. అనంతరం నామినేషన్లు వేశారు. – అక్షరటుడే, నెట్‌వర్క్**



మెండోరా మండలం పోచంపాడ్‌లో సంఘమిత్ర..





బోర్గం గ్రామంలో చిన్నసాయిలు..



మెండోరాలో కుంట లక్ష్మి రమేశ్..

## సర్పంచ్ అభ్యర్థి నామినేషన్‌ను పరిగణనలోకి తీసుకోవాలి

**అక్షరటుడే, ఆర్మూర్ :** జక్రాన్‌పల్లి మండలంలో మునిపల్లి సర్పంచ్ అభ్యర్థి చింతల గోపి నామినేషన్‌ను పరిగణనలోకి తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి కోరారు. ఈ మేరకు ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియాకు వినతిపత్రం అందజేశారు. సర్పంచ్ అభ్యర్థిగా చింతలగోపి నామినేషన్ దాఖలు చేశారన్నారు. సదరు వ్యక్తి ఆర్టీసీలో ఉద్యోగం చేస్తున్నట్లుగా ఫిర్యాదు రాగా గోపి నామినేషన్ పత్రాన్ని తాత్కాలికంగా పక్కన పెట్టారని వివరించారు. గోపి ఉద్యోగం మానేసి చాలా రోజులైందని.. వెంటనే అతడి అభ్యర్థిత్వాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. మునిపల్లి గ్రామంలో పాత రిజర్వేషన్లే ఖరారు చేయడంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి పోటీదారులు ఉండకూడదనే ఉద్దేశ్యంతో ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. ఆయన వెంట బీజేపీ నాయకులు ఉన్నారు.



## ఘనంగా దత్తజయంతి వేడుకలు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పట్టణంలో దత్తాత్రేయ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, ధ్వజారోహణం, దత్తాత్రేయుని డోలారోహణం, గురుపూజ, అఘోత్తర 128 దీపారాధన, మంగళహారతి, మహా నివేదన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరై ప్రత్యేకపూజలు చేసి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. అయ్యప్పస్వామి మాలధారులు, ఇతర భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో నిర్వహించిన దత్తాత్రేయ జయంతి వేడుకల్లో ఎల్లారెడ్డి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పాల్గొని దత్తాత్రేయుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సురేందర్‌ను పూజారితో పాటు ఆలయ నిర్వాహకులు తులసీదాస్ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# సర్పంచ్ అభ్యర్థి ఇంటి ముందు టెంట్ దగ్ధం

**అక్షరటుడే, గాంధారి :** సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థి ఇంటి ఎదుట టెంట్ కాలిపోయింది. ఈ ఘటన గాంధారిలో చోటు చేసుకుంది. అయితే ప్రమాదవశాత్తు టెంట్ కాలిపోయిందా.. ఎవరైనా తగులబెట్టారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గాంధారి తాజా మాజీ సర్పంచ్ సంజీవ్ యాదవ్ ఈసారి కూడా తన భార్య రేణుకతో నామినేషన్ వేయించారు. ఎలక్షన్ నేపథ్యంలో తన ఇంటి వద్ద అనుచరులు, గ్రామస్థులు కూర్చోవడానికి వీలుగా టెంట్ ఏర్పాటు చేశారు. గురువారం తెల్లవారు సమయంలో చూసేసరికి ఒక టెంట్ పూర్తిగా దగ్ధం కాగా.. మూడు సైడ్ వాళ్లు సైతం కాలిపోయాయి. ప్రమాదవశాత్తు టెంట్ తగలబడిందా లేదా ఎవరైనా కావాలని తగలబెట్టారా అని గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. మూడు బైకులకు సంబంధించిన సీట్లు కూడా కాలిపోయాయి.



## ఘనంగా స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ జన్మదిన వేడుకలు



**అక్షరటుడే, ఇందూరు:** రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్, వనపర్తి జిల్లా అధ్యక్షుడు శివ సేనా రెడ్డి జన్మదినాన్ని యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నగరంలో ఘనంగా నిర్వహించారు. హమాల్‌వాడీ ఆలయం సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి విక్కీ యాదవ్ ఆధ్వర్యంలో గురువారం పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు విపుల్ గౌడ్, ప్రధాన కార్యదర్శి నరేందర్ గౌడ్, నగర ఉపాధ్యక్షుడు శుభం, నార్త్ మండల అధ్యక్షుడు దినేష్, జనార్దన్,ఈశ్వర్, గట్ల నరేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



## ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడికి సన్మానం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి మండల వైశ్య సంఘం అధ్యక్షుడు సిద్ది శ్రీధర్ గుప్తాను బీజేపీ రాష్ట్ర నాయకుడు పైడి ఎల్లారెడ్డి గురువారం సన్మానించారు. ఇటీవల నిర్వహించిన ఆర్యవైశ్య ఎన్నికల్లో సిద్ధి శ్రీధర్ ఏకగ్రీవంగా ఎన్నికైనందున ఆయనను అభినందించారు. అనంతరం 18వ సారి మాలధారణ చేసిన రాచకొండ హరిబాబు స్వామి పడిపూజ కార్యక్రమం సందర్భంగా కుటుంబసభ్యులను కూడా పైడి ఎల్లారెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.



## ఘనంగా స్వామివారి రథోత్సవం

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ మండలం మగ్గిడి గ్రామంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి కల్యాణాన్ని ఘనంగా జరిపించారు. అనంతరం స్వామివారి రథోత్సవాన్ని గ్రామ వీధుల గుండా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం



**అక్షరటుడే, భీమ్‌గల్:** పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు దివ్యాంగ ఉపాధ్యాయుడైన ఎంఏ సలీంను శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈవో స్వామి మాట్లాడుతూ వికలాంగులను అందరితో సమానంగా చూడాలన్నారు. దివ్యాంగుల్లో ఉన్నత స్థానాల్లో నిలిచిన వారిలో ఎంతో మంది ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివకుమార్, ఇమాన్యుల్, వినోద్, సాగర్, మురళి, రమణ తదితరులు పాల్గొన్నారు.